క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు డివిజన్ పరిధిలో ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు. ఈ మేరకు అన్ని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాల్లో చెల్లింపులు చేయవచ్చని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బంగారుపాళెం: స్థానిక ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అరగొండ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మంది విద్యార్థులకు డాక్టర్లు గురుప్రశాంత్, చైతన్య, వినీత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిన అపోలో ఆస్పత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీఆర్ఓ కమ్రుద్దీన్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి అన్నదాన ట్రస్టుకు శనివారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. పూతలపట్టుకు చెందిన యువరాజు నాయుడు అన్నదాన ట్రస్టుకు రూ.ఒక లక్ష విరాళంగా ఇచ్చుకున్నారు. కార్యక్రమంలో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చామంతిపురంలో వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ ద్వారా పల్లెల్లోనే ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత లిపారు. చామంతిపురంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నడవలేని పరిస్థితిలో ఉన్న వారందరికీ వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం మధుమేహం, బీపీ, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ప్రతి బుధ, శనివారాల్లో ఆశా వర్కర్లు గర్భిణులకు ప్రత్యేకంగా ఇంటివద్దకు వెళ్లి వారి వివరాలను సేకరించి వైద్యం అందజేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది యమున, శశికళ, రాధ, దేవప్రీత పాల్గొన్నారు.

కాణిపాకం ఈవో తనిఖీలు



తనిఖీలో ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని పలు విభాగాల ను శనివారం ఈవో పెంచల కిషోర్ తనిఖీ చేశారు. వసతి సముదాయంలో పరిశుభ్రత, నిర్వహణపై సిబ్బందిపై పలు సూచనలు చే శారు. భక్తులు ఇబ్బంది కలగకుండా చూడా లని ఈవో ఆలయ అధికారులకు సూచించారు. నిర్వహణలో లోపాలు వస్తే తక్షణం స్పందించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు కృష్ణారెడ్డి, ధనంజయ, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డ్రైవ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ డోర్ టూ డోర్ సర్వే ఆధారంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల నమోదుపై దృష్టి సారించాలని స్పష్టం చేశబుూరు. బడి బయట పిల్లలు, ఇప్పటి వరకు పాఠశాలలకు వెళ్లని పిల్లలను గుర్తించి స్కూళ్లలో చేర్పించాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు తప్పనిసరిగా బడిలో చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అవగాహన



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రసాద్‌దాస్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ రాష్ట్ర సంచాలకుడు అన్సుమన్ ప్రసాద్ దాస్ శనివారం చిత్తూరులోని మై భారత్ కార్యాలయాన్ని సందర్శించారు. రూరల్ మండలంలోని ముత్తుకూరు గ్రామంలో పర్యటించి కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, వార్డు సచివాలయాలలో స్వచ్ఛంద సేవకులుగా పనిచేసిన 30 మంది వలంటీర్లకు ధ్రువీకరణపత్రాలు అందించారు. రాయలసీమ యూత్ అసోసియేషన్ ఫర్ సేవ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్, గణాంకాధికారి ఎంసీ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణే మా లక్ష్యం



చిత్తూరు అర్బన్: ప్రజల రక్షణే తమ లక్ష్యమని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. నగరంలోని సాయుధ దళం కార్యాలయంలో శనివారం నూతన ద్విచక్ర వాహనాలను ప్రారంభించారు. అనంతరం ర్యాలీలో పాల్గొని నూతన వాహనాన్ని నడిపారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జిల్లాకు 16 బైక్‌లను కేటాయించామన్నారు. అడిషనల్ ఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానందకిషోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, సీఐ మహేశ్వర పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వీ నరసింహారావు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరులోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ.నరసింహారావు మాట్లాడారు. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున కార్మిక, విద్యార్థి, యువజన, మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్, మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన కౌన్సెలింగ్



వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో చేపట్టిన కౌన్సిలింగ్‌ను కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకుకుని, బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వార్డు కార్యదర్శుల నుంచి, ఆప్షన్ ఫామ్స్ తీసుకున్నారు. రెండు రోజులపాటు జరిగిన ప్రక్రియలో వార్డు సచివాలయాల పరిధిలో 6 కేటగిరీలకు చెందిన కార్యదర్శులకు కౌన్సిలింగ్ సజావుగా పూర్తయింది. కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పాల్గొన్నారు.



బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ సిబ్బంది

తప్పుడు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కాణిపాకం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ డమ్మీలయ్యాయని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టిందన్నారు. సూపర్‌సిక్స్‌ను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కూటమి హామీలు ఏమయ్యాయని ప్రజలతో పాటు మనం కూడా ప్రశ్నిద్దామన్నారు. అనంతరం మండలాల వారీగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు మధుకుమార్, శిరీష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, హరిరెడ్డి, సురేష్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శాంతిసాగర్‌రెడ్డి, సుధాకర్, చిన్నారెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రీకాల్ మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ పార్టీ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యాసామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని దిగువ మోదలపల్లె మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు. మండలంలోని దిగువ మోదలపల్లెలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్లో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రోజా చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, యూనిఫాం, విద్యాసామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలచంద్రారెడ్డి, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలు నిర్మించండి



వినతిపత్రం అందజేస్తున్న కొల్లా చిట్టిబాబు

గుడిపాల: మండలంలోని 197 రామాపురం వీధుల్లో మురుగునీటి కాలువలు నిర్మించాలని బీజేపీ సీనియర్ నాయకుడు కొల్లా చిట్టిబాబు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలోని అకౌంట్స్ అధికారి మొహియుద్దీన్‌కు శనివారం ఆయన వినతిపత్రం అందించారు. చిట్టిబాబు మాట్లాడుతూ, గత పదేళ్లుగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదని ఇళ్ల నుంచి వచ్చే అపరిశుభ్రమైన నీరు వీధుల్లోనే ప్రవహిస్తోందన్నారు. ముఖ్యంగా శివాలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు ఉన్న వీధులు మురుగునీటితో చాలా అధ్వాన్నంగా మారాయని పేర్కొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్: సైబర్, మహిళలపై జరిగే నేరాలు, రోడ్ సేఫ్టీపై అదనపు ఎస్పీ రాజశేఖర్‌రాజు అవగాహన కల్పించారు. శనివారం చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి మొబైల్ యాప్ ఉపయోగాలు, ప్రమాదం వచ్చినప్పుడు ఎలా సాయం పొందాలనే అంశాలపై మాట్లాడారు. యువత మత్తుకు దూరంగా ఉండే అవశ్యకతను తెలియజేశారు. మానసిక ఆరోగ్యం , మత్తు దుర్వినియోగ ప్రభావాలు పై ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర్ మాట్లాడారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

గుడిపాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థలకు శనివారం షూస్ (బూట్లు) పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు హసన్‌బాషా, గణపతి అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని 2,084 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసినట్లు వివరించారు.



ప్రధానోపాధ్యాయులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

సేవలే కలకాలం గుర్తుంటాయి



భూపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విధులు నిర్వర్తించే సమయంలో చేసిన సే వలే కలకాలం గుర్తుండి పోతాయని, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ని చ్చేలా మంచి పేరు ప్రఖ్యాతు లు తెస్తాయని చిత్తూరు ఉపవిద్యాశాఖాధికారి ఇందిర అన్నా రు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(లెక్కల ఉపాధ్యాయుడి)గా విధులు నిర్వర్తిస్తున్న భూపాల్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో శనివారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రాజేంద్ర అధ్యక్షతన సన్మాన కార్యక్ర మా న్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీవై ఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా భూపాల్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తప్పనిసరని అన్నారు. అనంతరం భూపాల్ రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

3న ఉపకరణాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: దివ్యాంగులు, వయోవృద్ధులకు కృత్రిమ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జూలై 3న చిత్తూరులో నిర్వహించనున్నట్లు డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. దీనిపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

డ్రైవర్‌కు విరమణ సన్మానం



డ్రైవర్‌ను సన్మానిస్తున్న అధికారులు, సహచరులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్యారోగ్యశాఖలో డ్రైవరుగా పనిచేసి విరమణ పొందుతున్న ధనంజయను శనివారం ఘనంగా సన్మానించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డ్రైవర్‌కు వీడ్కోలు సన్మానం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సుధారాణి. క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, జిల్లా మలేరియా అధికారి అనిల్ కుమార్, ఎస్ ఓ జార్జ్, సూపరింటెండెంట్ గిరిధర్ రెడ్డి తదితరులు డ్రైవర్ ధనంజయని ఘనంగా సత్కరించారు. రథసారథి సంఘం తరఫున నేతలు గజమాల, దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో జిల్లా డ్రైవర్ల సంఘం మాజీ అధ్యక్షుడు పన్నీరు సెల్వం, చంద్ర పాల్గొన్నారు.